## క్లుప్తంగా

### ఆధ్యాత్మికతతో ఖైదీల్లో మార్పు



ఖైదీలకు సత్ప్రవర్తనను బోధిస్తున్న ఓం శాంతి ప్రచారకురాలు రమాదేవి

నందికొట్కూరు: భగవంతుడి నామస్మరణతో ఖైదీలలో సత్ప్రవర్తన కలుగుతుందని ఓం శాంతి ప్రచారకురాలు రమాదేవి అన్నారు. ఆదివారం పట్టణంలోని సబ్‌జైల్‌లో ఖైదీలకు భగవంతుడి మార్గం గురించి, సమాజంలో ఎలా ఉండాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భగవంతుడి మార్గంలో ముందుకు సాగేందుకు ప్రయత్నించాలన్నారు. చెడు మార్గం, చెడు ఆలోచనలు దరి చేరనివ్వకుండా జీవన ప్రయాణం సాగించాలని చెప్పారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కోళ్లబావాపురంలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

నందికొట్కూరు: మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత గ్రంథం ప్రచారం ఆదివారం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు వెంకటేశ్వర్లు, మునిదాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. కోరికలు, కర్మలు పూర్తిగా లేకుంటే ఉత్తరాయణం రోజు మోక్షం కలిగి విముక్తి కలుగుతుందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగమద్దిలేటి, సంజీవ, రమణమ్మ, నాగలక్ష్మి, కృష్ణవేణి, చందు, చక్రపాణి, తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

### సీఐ బాధ్యతల స్వీకరణ



సురేష్ కుమార్ రెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు రూరల్ సీఐగా సురేష్ కుమార్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీ కరించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లె ఎస్‌ఐలతో శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్షించారు. డీఎస్పీ రామాంజినాయక్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా సురేష్‌కుమార్‌రెడ్డి గతంలో ఆత్మకూరు ఎస్‌ఐగా నాలుగేళ్లు పనిచేసిన అనుభవం ఉంది.

### మిడుతూరు ఎస్‌ఐగా ఓబులేసు



మిడుతూరు: నంద్యాల వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ హెచ్. ఓబులేసు మిడుతూరు ఎస్‌ఐగా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ జగన్‌మోహన్ బండిఆత్మకూరు ఎస్‌ఐగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎస్‌ఐ ఓబులేసు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు ప్రశాంత జీవనం గడపాలని, అల్లర్లు సృష్టించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

### వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు

పగిడ్యాల: స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ముచ్చుమర్రి, ప్రాతకోట, లక్ష్మాపురం ఫీడర్ల కింద వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు మండల విద్యుత్ ఏఈ క్రాంతికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముచ్చుమర్రి ఫీడర్ కింద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. అలాగే లక్ష్మాపురం, పడమర ప్రాతకోట ఫీడర్ల కింద ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరా ఉంటుందని వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్ వేళల్లో మార్పులు చేశామని రైతులు సహకరించాలని ఆయన కోరారు.

### ఫుడ్ కోర్టు వేలం

నంద్యాల(అర్బన్): జిల్లాలోని కొత్తపల్లి మండలం సంగమేశ్వరంలోనున్న ఫుడ్ కోర్టు, పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో నిర్మాణంలోనున్న కట్టడాన్ని జిల్లా పర్యాటక శాఖ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముచ్చుమర్రిలోని కట్టడాన్ని ఈ నెల 22వ తేదీన, సంగమేశ్వరంలోని ఫుడ్ కోర్టును ఈనెల 23వ తేదీన కలెక్టరేట్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5వేలు దరావత్తును జిల్లా కలెక్టర్, చైర్మన్, జిల్లా పర్యాటక మండలి పేరు మీద చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు సెల్ 7995087089, 8297098022 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# మహిళలపై దాడులను అరికట్టాలి



ఆత్మకూరులో ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, సీనియర్ జర్నలిస్ట్ శీలం శేషు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిపై రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో పీజీ వైద్యురాలిపై ఆగస్టు 9వ తేదీ ఆస్పత్రిలో మానవ మృగాలు పాశవికంగా అత్యాచారం, హత్య చేసి విగతజీవిగా మార్చారన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ హత్యాచారాన్ని కప్పిపుచ్చి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేయగా పోస్టుమార్టం నివేదికలో నిజానిజాలు బయటపడి ఒకరికన్నా ఎక్కువ మంది అత్యాచారం చేశారని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైందని తెలిపారు. దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రణధీర్, స్వాములు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్, రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న, నాయకులు భాస్కర్, కిరణ్, మాల మహానాడు నాయకులు క్రిష్టఫర్, ప్రజా సంఘాల నాయకులు శివయ్య, రామకృష్ణ, భాస్కర్, శివ పాల్గొన్నారు.

# పేద రోగులకు నాణ్యమైన వైద్యం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న అమెరికా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హెపటోలోజిస్ట్ వైద్యురాలు సరస్వతి

నందికొట్కూరు: పేద రోగులకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని అమెరికా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హెపటోలోజిస్ట్ వైద్యురాలు లక్కసాని సరస్వతి అన్నారు. ఆదివారం పట్టణంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో ప్రముఖ రాజకీయ నాయకులు నరసన్నగౌడు జ్ఞాపకార్థంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వెయ్యి మందికి వైద్య చికిత్సలు చేసి మందులు ఉచితంగా ఇచ్చారు. ఆపరేషన్లు అవసరమైన 10 మందిని హైదరాబాద్‌లోని రవి ఇలియోస్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జన్మస్థలం రుణం తీర్చుకోవడానికి తండ్రి జ్ఞాపకార్థంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆర్థోపెడిక్ వైద్యుడు విజయభాస్కర్‌రెడ్డి, పీడియాట్రిక్ డాక్టర్ సాయిప్రసాద్, జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రవీంద్ర రోగులకు వైద్య చికిత్సలు చేశారు. టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అనంతపురం టౌన్ సీఐ పండ్ల రాజాగౌడ్, బాలాజీ, ప్రవీణ్, సోమశేఖర్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

### నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై మహబూబ్‌నగర్‌కు చెందిన బిందుమాధవి బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆనంద నర్తన గణపతిం, గణేశకౌత్వం, శివాష్టకం, ఓం నమఃశివాయ, భో శంభో తదితర గీతాలకు బిందుమాధవి, హర్షిణి, వినూత్న, జయశ్రీ, కావ్య, ధరణిశ్రీ, నందిత, గాయత్రీ, తన్మయి తదితరులు నృత్యప్రదర్శనతో అలరించారు. అలాగే రెండో కార్యక్రమంలో భాగంగా కర్నూలుకు చెందిన బి.నాగమల్లేశ్వరి, బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన చేశారు

### వేడుకగా పల్లకీ సేవ



ప్రత్యేక అలంకరణలో స్వామిఅమ్మవారు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివారి ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేశారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ విద్యుత్ పగటిపూట ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: ప్రభుత్వం రైతులకు వ్యవసాయ ఉచిత విద్యుత్‌ను పగటిపూటనే ఇవ్వాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రైతు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే.. వ్యవసాయానికి ఉచితంగా 9 గంటలు విద్యుత్ పగటిపూటనే ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడేమో రాత్రిపూట ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన రెండున్నర నెలల్లోనే హామీలను తుంగలో తొక్కేందుకు సీఎం చంద్రబాబునాయుడు కుట్రలు పన్నితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ విద్యుత్ వేకువజామున 4 గంటల నుంచి 10 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు ఇస్తున్నారని మండిపడ్డారు. ఓ వైపు వర్షాలు కురవక పంటలు ఎండిపోతుంటే వ్యవసాయ విద్యుత్ రాత్రిపూట ఇస్తామని అధికారులు ప్రకటించడం తగదన్నారు. రాత్రి వేళ్లలో విద్యుత్ ప్రమాదాలకు, పాముకాటుకు రైతులు గురయ్యే అవకాశం ఉందని, పగలే కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలు విస్మరిస్తే రైతులతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రైతు సంఘం నాయకులు సుధాకర్, రజాక్, మౌలాలి, మాబాషా, ఇంతియాజ్, పాండురంగయ్య, స్వాములు, రమణ, రాముడు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

### మహానందీశుడి సేవలో..



అధికారులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు

నంద్యాల(అర్బన్): మహానందిలోని మహానందీశ్వరస్వామి, కామేశ్వరి అమ్మవారిని జిల్లా స్టేట్ బ్యాంక్ హెచ్‌ఆర్ కేశవగౌడ్, ఏపీ అమరావతి సీడీఓ రాహుల్ సంక్రీతీయ ఆదివారం వారి బృందంతో దర్శించుకున్నారు. దేవస్థానం సహాయ కార్యనిర్వహణ అధికారి మధు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఏకగ్రీవంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తాలూకా కమిటీ

నందికొట్కూరు: ఉదోగ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, కార్యదర్శి తిరుపాలయ్య అన్నారు. ఆదివా రం పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం ఆవరణ లో ఏపీజీఈఏ తాలుకా కమిటీ అధ్యక్షుడిగా కే.బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా నర్సరాజు, సహాధ్యక్షుడిగా కే.రోషద్, కోశాధికారిగా పీ.రాముడు, ఉపాధ్యక్షులుగా భువనేశ్వరి, జగదీష్‌కుమార్, రంగస్వామి, కృష్ణమూర్తి, జ్యోతి, నూరుల్లా, నాగేశ్వరమ్మ, జా యింట్ సెక్రటరీలుగా గుట్టలయ్య, మహబూబ్ బా షా, శ్రీనివాసులు, జాఫర్, కామేశ్వర ప్రసాద్, రామ చంద్రయ్య, మద్దిలేటి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టైపిస్టు వెంకటస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఏపీజీఈఏ పని చేస్తుందన్నారు. ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తాలుకా, జిల్లా కమిటీలకు తెలియజేయాలని కోరారు.

### డీఎస్పీని కలిసిన బంజారా సంఘం నేతలు



డీఎస్పీ రామంజినాయక్‌తో బంజారా సేవా సంఘం నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు సబ్ డివిజన్‌కు కొత్తగా డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న రామాంజినాయక్‌ను ఆదివారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు కె.బాలునాయక్, దశావత్, రామ్ బాలాజీనాయక్, నాగస్వామినాయక్, రమేష్‌నాయక్, మల్లికార్జున నాయక్ తదితరులు కలిశారు. శాలువా, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

# మనిషిలో దైవత్వంతో సమసమాజ స్థాపన



స్వామి వారికి తీర్థప్రసాదాలు అందజేసిన అర్చకులు

నంద్యాల(అర్బన్): ప్రతి మనిషిలో దైవత్వాన్ని చూసిన నాడే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని కాకనూరు శ్రీ శారదా పీఠం పీఠాధిపతి శ్రీశివ యోగేంద్ర సరస్వతి స్వామి పేర్కొన్నారు. ఆదివారం మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన స్వామి వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీకామేశ్వరిదేవి సమేత శ్రీ మహానందీశ్వరస్వామి వారికి పీఠాధిపతులు అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దర్శనం, పూజలు అనంతరం ఆయనకు ఆలయ అధికారులు ఆశీర్వచన మండపంలో తీర్థప్రసాదాలు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను అరికట్టే చర్యలు తీసుకోవాలని కోరారు.

# ముగిసిన ద్విశతావధానం



ద్విశతావధానం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ బులుసు అపర్ణ

శ్రీశైలంటెంపుల్: శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం పశ్చిమగోదావరి జిల్లా భీమడోలుకు చెందిన డాక్టర్ బులుసు అపర్ణ వారిచే నిర్వహించిన ద్విశతావధానం ఆదివారం ముగిసింది. అవధాన కవితా నీరాజనం పేరుతో ఈ నెల 14వ తేదీ నుంచి ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళారాధన వేదికపై ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 60 మందికి పైగా కవి పండితులు పృచ్ఛకులుగా పాల్గొన్నారు. మొదటిరోజు ప్రారంభసభకు డోన్ చెందిన కళారత్న గండ్లూరి దత్తాత్రేయశర్మ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నంకు చెందిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ పేరి రవికుమార్ సంధానకర్తగా వ్యవహరించారు. ఐదు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలోబులుసు అపర్ణ 50 సమస్యలు, 50 దత్తపదులు, 50 వర్ణాంశాలు, 30 ఆశువులు, 20 ఘంటావధానాలను పూరించారు. కార్యక్రమం ముగింపులో అవధానానికి, విశిష్ట అతిథులకు, పృచ్ఛకులుగా వ్యవహరించిన కవిపండితులందరికి వేదాశీర్వచనముతో శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, పర్యవేక్షకురాలు గిరిజామణి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### శాంతి భద్రతల పరిరక్షణ కృషి



కొత్తపల్లి గ్రామంలో గస్తీ కాస్తున్న పోలీసులు

కొత్తపల్లి: గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఏఎస్ఐ బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి బావాపురం, లింగాపురం, కొత్తపల్లి గ్రామాలలో గస్తీ నిర్వహించారు. కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామాలలో గుంపులుగా ఉండి అల్లర్లకు దారితీసేలా ప్రవర్తించకూడదన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం, ర్యాష్ డ్రైవింగ్ లాంటివి చేయరాదన్నారు. నాటుసారా తయారీదారులు, విక్రేతలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. హెడ్ కానిస్టేబుల్ శేషారాం సింగ్, సిబ్బంది ఉన్నారు.

# వీబీఆర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల



నిండుకుండలా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటి విడుదల కొనసాగుతోంది. వీబీఆర్ సామర్థ్యం 16.95 టీఎంసీల గాను ఆదివారం సాయంత్రానికి 14.287 టీఎంసీలకు చేరింది. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ మీదుగా వీబీఆర్‌లోకి 10100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో వీబీఆర్ నుంచి మద్రాస్ కాలువకు 5000 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 5 వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలుగు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు. తెలుగు గంగ జలాశయాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న సందర్శకులతో రిజర్వాయర్ వద్ద సందడి నెలకొంది.

# సున్నిపెంటలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్

శ్రీశైలంప్రాజెక్ట్: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సున్నిపెంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కర్నూలు శాంతిరాం కంటివైద్యశాల టెక్నీషియన్ శేఖర్, మేనేజర్ నాగార్జున 130 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. ఆపరేషన్ కోసం 20 మందిని కర్నూలుకు తరలించారు. 25 మందికి కంటి అద్దాలకు సిఫారసు చేశారు. మిగిలిన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్‌అహ్మద్, మండల అధ్యక్షుడు ఎస్‌కే.నజీర్, ఖాదర్‌వళి, ప్రధాన కార్యదర్శి సుభాన్, ఎస్ఎ.జావెద్, సిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్వర్‌బాషా, ఇస్మాయిల్, టీడీపీ నాయకులు ఉమామహేశ్వరరావు, రామసుబ్బారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: కేరళలో వరద బాధితులను ఆదుకోవాలని, జరిగిన విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, అధ్యక్ష, ఉపాధ్యక్షులు రజాక్, రణధీర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రం వయనాడ్‌లో జరిగిన విపత్తు కారణంగా 300 కుటుంబాలు మరణించాయని తెలిపారు. వందలాది మంది ఆస్పత్రి పాలయ్యారన్నారు. జాతీయ పరిశోధన సంస్థకు కూడా అందని విధంగా నష్టం జరిగిందన్నారు. కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని విధాలా వరద బాధితులను ఆదుకునేందుకు ప్రయతిస్తోందన్నారు. తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు సాయం చేస్తున్నాయన్నారు. ఈ విరాళాలకు సహకరించిన ఆటో కార్మికులకు పట్టణ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. నాయకులు మల్లయ్య, గణపతి, రవి, చాంద్‌బాషా, ఖలీముల్లా, విజయ్, జబివుల్లా పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల కార్యవర్గం ఎన్నిక



గణమల మల్లయ్యను సన్మానిస్తున్న సభ్యులు

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడిగా గణమల మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని మారియా ఉన్నత పాఠశాల ఆవరణలో నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారుల ఆధ్వర్యంలో ఆత్మకూరు అపుస్మ యూనిట్ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో కొత్తపల్లి సరస్వతీ విద్యా మందిర్ కరస్పాండెంట్ గణమల మల్లయ్య, వెలుగోడు బృందావన్ స్కూల్ కరస్పాండెంట్ ఫయాజ్ ఆలీఖాన్, ఆత్మకూరు గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ సాయిప్రణీత్‌లను ఎన్నుకున్నారు. మారియా స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్‌ఖాలిక్ గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు, కొత్తపల్లి, వెలుగోడు, అపుస్మ సభ్య కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆదివారం అవగాహన కల్పించారు. విద్యార్థులందరికీ సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీలను పంపిణీ చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం ఎలా కృషి చేయాలి, ప్లాస్టిక్ పదార్థాలపై నిషేధం, వాటి వల్ల వన్యప్రాణులకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. పిల్లలు, పెద్దలు, సరుకులు, కూరగాయలు తదితర వస్తువులు కొనేందుకు బజారుకు వెళ్లినప్పుడు గుడ్డ సంచులను తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలని, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను ఎట్టి పరిస్థితిలో వినియోగించవద్దని సూచించారు. అలాగే ఇళ్లలో జరిగే శుభకార్యాలకు ప్లాస్టిక్ గ్లాసులు వినియోగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ డబ్బాల స్థానంలో స్టీలు, ఇత్తడి, పింగాణి పాత్రల్లో ఆహార పదార్థాలను నిల్వ ఉంచుకోవాలని సూచించారు.

### వివాదాస్పద స్థల పరిశీలన



గోకవరంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయనాయక్

కొత్తపల్లి: మండల పరిధిలోని గోకవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న స్థల వివాదంపై ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయ నాయక్ విచారణ చేపట్టారు. వివాదాస్పద స్థలాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన సామేష్, ఎస్సీ కాలనీ వాసులకు ఇంటి వద్ద ఉన్న స్థలం విషయంలో వివాదం ఏర్పడింది. మహిళలు ఆ స్థలంలో బహిర్భూమికి వెళుతున్నారని, అలా చేయకూడదని కాలనీవాసులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆ విషయంపై స్థల పరిశీలన చేశారు. ఇరు వర్గాల వారితో మాట్లాడారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఐకమత్యంగా మెలగాలని గొడవలు, అల్లర్లకు పోకూడదన్నారు. స్థల వివాదాన్ని త్వరగా పరిష్కారం చేస్తామన్నారు. అంతవరకు సంయమనం పాటించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఏఎస్ఐ బాబా ఫకృద్దీన్ వెంట ఉన్నారు.

### శ్రీశైలంలో భారీ వర్షం



శ్రీశైలంలో కురుస్తున్న వర్షం

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు గంటన్నర పాటు కుండపోత వర్షం కురువగా, ఆదివారం మధ్యాహ్నం అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. క్షేత్ర వ్యాప్తంగా వివిధ సత్రాలు, కల్యాణ మండపాల్లో పెళ్లిళ్ల జరుగుతుండడంతో వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. పెళ్లి ఊరేగింపులకు వర్షం అడ్డంకిగా మారడంతో అర్ధాంతరంగా ఊరేగింపులు ఆపేసి పెళ్లి వారంతా కల్యాణ మండపాలకు చేరుకున్నారు. మల్లన్న దర్శనార్థ అనంతరం భక్తులు పార్కింగ్ చేసిన వాహనాల వద్దకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడ్డారు.

### తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని మేనమామకు అప్పగించిన పోలీసులు

బొమ్మలసత్రం: నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో తప్పిపోయిన బాలుడిని కమాండ్ కంట్రోల్ పోలీసులు కేవలం రెండు గంటల్లో వెతికి అప్పగించిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జలకనూరు గ్రామానికి చందిన హేమంత్ నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. ఆదివారం కావటంతో తన మేనమామ శ్రీనుతో కలిసి బయటికి వెళ్లాడు. ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగానే బాలుడు బహిర్భూమికని వెళ్లి తిరిగి రాలేదు. బాలుడి మేనమామ ఉన్న స్థలాన్ని గుర్తించలేక బస్టాండ్ చుట్టు పక్కల వెతకసాగాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్‌కు శ్రీను జరిగిన విషయం చెప్పడంతో కమాండ్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తం చేశారు. బస్టాండ్ సమీపంలో తిరుగుతున్న బాలుడిని గుర్తించారు. రెండు గంటల్లో తనకు అప్పగించినందుకు శ్రీను కృతజ్ఞతలు తెలిపాడు.